మట్టి గణపతికే జై

- విభిన్న రూపాల్లో సిద్ధమైన గణపతి ప్రతిమలు
- కోల్‌కతా మట్టి విగ్రహాలకు డిమాండ్
- 2 నుంచి 20 అడుగుల సైజుల్లో లభ్యం
- 25 ఏళ్లుగా అక్కయ్యపాలెంలో తయారీ


ఇరవై అడుగుల మట్టి గణపతిని తయారు చేస్తున్న కళాకారుడు

సీతంపేట: వినాయక చవితి సమీపిస్తుండడంతో పూజలందుకోవడానికి గణనాథులు సిద్ధమైపోయారు. పర్యావరణానికి హాని కలిగించని రీతిలో మహోత్సవాలు జరపడానికి నిర్వాహకులు సన్నద్ధమయ్యారు. వీధుల్లో గణపతి మండపాల్లో మట్టి ప్రతిమలే ఏర్పాటు చేయడానికి యువత కూడా ఆసక్తి చూపిస్తున్నారు. ధర కాస్త ఎక్కువైనా గతంలో కంటే నగరంలో పర్యావరణానికి హాని కలిగించని విధంగా మట్టి, వాటర్ కలర్స్‌తో తయారు చేసిన ప్రతిమల వినియోగం పెరిగింది. దీంతో కోల్‌కతా కళాకారులు తయారు చేస్తున్న ప్రతిమలకు డిమాండ్ పెరిగింది. కోల్‌కతా నుంచి వచ్చిన కళాకారులు కొకోన్, నోవాపాల్ బృందం గత 25 ఏళ్ల నుంచి నగరంలో విగ్రహాలు తయారు చేసి అందిస్తుండటం విశేషం. ఏటా వినాయక చవితికి రెండు నెలల ముందుగా కళాకారులతో మట్టి విగ్రహాల తయారీని ప్రారంభిస్తున్నారు. అక్కయ్యపాలెంలో చిన్నూరు, రామచంద్రానగర్, శంకరమఠం పక్కన, 80 అడుగుల రోడ్ ప్రాంతాల్లో తాత్కాలిక షెడ్లలో మట్టి ప్రతిమలను తయారు చేస్తున్నారు. మట్టి, సరుగుడు కర్ర, గడ్డి, వాటర్ కలర్స్ వినియోగించి హానికరం కాని విగ్రహాలను రూపొందిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. మట్టిలో సులువుగా కలిసిపోయే సామగ్రితోనే కోల్‌కతాతో విగ్రహాలు తయారీ చేస్తారని, ఆ పద్ధతినే విశాఖలో ప్రవేశపెట్టామని, 25 ఏళ్లుగా విశాఖ ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని అంటున్నారు కళాకారులు కొకోన్, నోవాపాల్.

విభిన్న రూపాల్లో ఆకట్టుకునేలా...

రెండు అడుగుల ఎత్తు నుంచి 20 అడుగుల ఎత్తైన మట్టి విగ్రహాలు చూడముచ్చటగా ఆకట్టుకునే రీతిలో తయారు చేస్తున్నారు. మంచి ఫినిషింగ్ కోసం కోల్‌కతా నుంచి ప్రత్యేకంగా మట్టిని తీసుకు రావడం విశేషం. సుమారు 30 రకాలకు పైగా వినాయక ప్రతిమలను ఏటా రూపొందిస్తున్నారు. మత్స్య గణపతి, సింహాద్రి అప్పన్న, శివ గణపతి, ఆంజనేయ గణపతి, కృష్ణావతార గణపతి, త్రిమూర్తులు, కాణిపాక గణపతి, హైదరాబాద్ గణపతి, శివపూజ గణపతి, మహారాజా గణపతి, మయూర గణపతి, బాలాజీ గణపతి, అయ్యప్ప గణపతి... ఇలా ఎన్నో వెరైటీ విగ్రహాలను రూపొందిస్తున్నారు.


ఉత్సవాలకు సిద్ధం చేస్తున్న గణనాథులు


అయ్యప్ప రూపంలో గణపతి


శివ గణపతికి తుది మెరుగులు దిద్దుతున్న శిల్పి


పడవ నడుపుతున్న గణనాథుడు

చాలా కష్టమైన పని



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కంటే మట్టితో విగ్రహాలు రూపొందించడం చాలా కష్టమైన పని. 15 అడుగుల మట్టి బొమ్మ తయారీకి నలుగురు కళాకారులు 10 రోజులు కష్టపడాల్సి ఉంటుంది. మూడు అడుగుల బొమ్మ తయారీకి ఒక వ్యక్తి రెండు రోజులు పనిచేయాలి. సైజుని బట్టి రూ.7 వేల నుంచి రూ.80 వేల ఖరీదైన బొమ్మలు తయారు చేస్తున్నాం. ఈ సారి ఆర్డర్లు బాగా వచ్చాయి. ఆర్డర్ల మేరకు తయారు చేస్తున్నాం. తమ దగ్గరకు వచ్చే వారు రకరకాల కాన్సెప్ట్‌లు చెబుతుంటారు. వారికి కావాల్సిన విధంగా విగ్రహాలు తయారు చేసి ఇస్తుంటాం.

– కొకోన్, కోల్‌కతా విగ్రహ కళాకారుడు

చేతితోనే ఆకట్టుకునే ప్రతిమలు


ఉత్సవాలకు సిద్ధం చేసిన భారీ మట్టి గణపతి


తుది మెరుగులు తర్వాత ప్రతిమలు

కంచరపాలెం : పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతతో మట్టి ప్రతిమలను పూజించాలని పలువురు పర్యావరణవేత్తలు చైతన్యపరచడంతో వాటికి భారీ డిమాండ్ పెరిగింది. ప్రజల్లో చైతన్యం తీసుకురావటానికి గత ఏడాది నగరంలో పలుచోట్ల సేవా సంఘాల కార్యకర్తలు మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. వీటికి డిమాండ్ పెరగడంతో కళాకారులు నుంచి నేరుగా వ్యాపారులు కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కోల్‌కతా, ఒడిశా నుంచి వలస వచ్చిన కళాకారులు కంచరపాలెం పరిధిలో గల పరమేశ్వరి థియేటర్ ఆవరణ, మల్లసూరి వీధి, ధర్మనగర్, రామ్మూర్తి పంతులపేట, 104 ఏరియా, పైడిమాంబకాలనీ, జ్ఞానాపురం ప్రాంతాల్లో మట్టి ప్రతిమలు తయారు చేస్తున్నారు. రసాయనాలు లేని సహజ రంగులను మాత్రమే ఉపయోగిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలనే ఉద్దేశ్యంతో తమంతట తామే మట్టి విగ్రహాల తయారీకి పూనుకున్నారు. మరోవైపు భక్తులను ఆకర్షించే విధంగా విగ్రహాలు తయారు చేస్తున్నారు. చేతితోనే విభిన్న ఆకారాల విగ్రహాలు తయారు చేయడం విశేషం. మట్టి ప్రతిమలకు డిమాండ్ వుందని, అయితే వీటి తయారీకి ఎక్కువ సమయం పడుతుందని న్యూ ఐడల్స్ విగ్రహాల తయారీదారుడు ఎస్.మూర్తి అంటున్నారు. కరోనా కష్టకాలం తర్వాత డిమాండ్ పెరిగిందని, ఇప్పటికే తయారు చేసిన వాటిలో 90 శాతం విగ్రహాలు విక్రయించేశామని తెలిపారు.

ఎన్నో ఏళ్లుగా తయారీ

మాది ఒడిశా రాష్ట్రంలోని ఓ మారుమూల గ్రామం. 35 ఏళ్ల క్రితమే విశాఖకు వచ్చేశాం. నా తండ్రి నుంచి వారసత్వంగా విగ్రహాల తయారీ ప్రారంభించాను. కష్టమైనా, నష్టమైనా వీటిని తయారుచేస్తూ పొట్ట పోసుకుంటున్నాం. స్థానిక వ్యాపారులతో కలిసి విగ్రహాలు తయారు చేస్తుంటాను. నాతోపాటు మరో 15 మంది కళాకారులను మా ఊరు నుంచి తీసుకొచ్చాను.

– సుధీర్‌పాల్, ఒడిశా కళాకారుడు

ఎంతో సంతృప్తి

జీవనోపాధికి కళాకారులుగా మారాం. చిన్ననాటి నుంచి విగ్రహాల తయారీలో శిక్షణ పొందాం. పండగ సమయాల్లో కుటుంబాన్ని విడిచి ఎనిమిది నెలలు విగ్రహాలు తయారు చేస్తాం. డబ్బు సంపాదించి ఇళ్లకు చేరుతాం. నాతోపాటు అనేక మంది కళాకారులు ఇదే వృత్తిగా నమ్ముకుని బతుకు సాగిస్తున్నారు. విగ్రహాల తయారీతో సంతృప్తి లభిస్తోంది.

– సుకాంతూపాల్, ఒడిశా కళాకారుడు

క్లుప్తంగా

వరద బాధితులకు రూ.లక్ష విరాళం


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి విరాళం చెక్కు అందజేస్తున్న వెంకటరామరాజు

సీతమ్మధార : విజయవాడలో వరదల కారణంగా నష్టపోయిన ప్రజల సహాయార్థం ప్రభుత్వానికి మారికవలసలోని హిమాద్రి ఐస్‌ప్లాంట్ యజమాని దాట్ల వెంకటరామరాజు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు బుధవారం చెక్కు అందజేశారు. ఈ చెక్కుని ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌కు పంపిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. విరాళం అందజేసిన రామరాజును అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ వర్మ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అపోహలు వద్దు


మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర శాస్త్రి

సీతంపేట : నల్ల గుడ్డు అంధత్వం బారినపడి అనేక మంది చూపు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ నేత్ర దానం చేసేందుకు ముందుకు రావాలని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆఫ్తాల్మజీ హెడ్ డాక్టర్ ప్రభాకర శాస్త్రి సూచించారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రోగులకు, వారి బంధువులకు నేత్రదానం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగిపోయేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో డాక్టర్ నవీన్‌కుమార్, హెడ్ నర్స్ రాజేశ్వరి, పీఎంవోవోలు ఉమా శ్రీనివాస్, సురేష్, కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత, పీజీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్టు స్థలంలో వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు


మెకానిక్‌లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు

సీతమ్మధార : గ్రీన్‌బెల్టు స్థలంలో వాహనాలు పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐ ఎన్.వి.భాస్కరరావు హెచ్చరించారు. ఈ మేరకు సీతంపేట గణేష్‌నగర్‌లో గల మెకానిక్ షాపుల నిర్వాహకులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడి గ్రీన్ బెల్టు స్థలంలో వాహనాల పార్కింగ్ కారణంగా పచ్చదనం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక నుంచి ఇక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా పాఠశాలలకు పిల్లలను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లంతా విధిగా నిబంధనలు పాటించాలని సూచించారు. వారితో ఆయన గురుద్వారా జంక్షన్ వద్ద గల వసంతబాల పాఠశాల ఆవరణలో బుధవారం సమావేశం నిర్వహించారు. పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తే ఆటోడ్రైవర్ల లైసెన్సులను మూడు నెలలపాటు సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫారం శివారులో గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్‌ఐ రవివర్మ తెలిపిన వివరాలిలా.. వేగంగా వెళ్తున్న రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడటంతో గాయాలపాలై మృతి చెందినట్టుగా గుర్తించారు. రైలు నుంచి పడటంతో తలకు బలమైన గాయాలు, శరీరంలో రగుడు గాయాల కావడంతో మరణించి ఉంటాడని భావిస్తున్నారు. ఈ వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభంచలేదు. ఎవరైనా గుర్తిస్తే 99895 70010 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ రవి వర్మ కోరారు.

దుర్గా గణపతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఈవో రమాభాయి, తదితరులు

సీతంపేట : సీతంపేటలో కొలువైన దుర్గా గణపతి ఆలయంలో ఈ నెల 7 నుంచి 15 వరకు వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో జి.వి.రమాభాయి, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను బుధవారం ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. నవరాత్రుల్లో రోజుకొక అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. 7న చవితి రోజున వెండి కవచంతో నిజరూప దర్శనం, 8న చందన గణపతి, 9న త్రిముఖ గణపతి, 10న స్కంద గణపతి, 11న శివబాల గణపతి, 12న వాణి గణపతి, 13న విష్ణు గణపతి, 14న ఆదిత్య గణపతి, 15న అర్ధనారీశ్వర గణపతి అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. 16న సాయంత్రం మేళతాళాలు, సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలతో సిద్ధి, బుద్ధి సమేత దుర్గా గణపతి ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. నవరాత్రుల 9 రోజులు గోత్ర నామాలతో సహస్రనామార్చన చేయించుకోవాలనుకునే భక్తులు రూ.300 చెల్లించి స్వామి ఆశీస్సులు పొందాలని సూచించారు.

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ఆందోళన


రైల్వే స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

తాటిచెట్లపాలెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్, విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ నేత జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సీపీఐ చేపడుతున్న ప్రజా ఆందోళనలో భాగంగా బుధవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్ ఇన్ గేట్ ఎదురుగా శ్రీ విజయదుర్గ ఆటో ఓనర్స్ కమ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ధరలు తగ్గిస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఇప్పిస్తామని, విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికి తీసి ప్రతీ పేద కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి పదేళ్లు దాటినా ఈ హామీలను నెరవేర్చలేకపోయారని ఆరోపించారు. డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై భారం మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంబానీ, అదానీలకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు కల్పిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం దేశవ్యాప్త ఆందోళన గోడపత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజేష్, నాగరాజు, ఆంజనేయులు, వై.వెంకట్, రావికృష్ణ, హెచ్.శేఖర్, జై గణేష్ కుమార్, శ్రీను, అప్పలరాజు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

సీతమ్మధార : రాష్ట్రంలో 2029లో అధికారం సాధించడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు అడుగులు వేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఈ మేరకు సీతమ్మధారలో గల కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని 272 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఒక్కో బూత్‌కు 200 మంది సభ్యులను పార్టీలో చేర్చుకోవడం లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు విధిగా సభ్యత్వ నమోదు చేయించుకోవాలని సూచించారు. వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్ నినాదంతో ముందుకు సాగాలన్నారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ కార్యకర్తలకు బీజేపీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, మాజీ అధ్యక్షుడు నాగేంద్ర, బీజేపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి సురేష్‌బాబు, సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కాశీవిశ్వనాథరాజు, నాయకులు శ్యామలాదీపిక, సునీల్, కేశవకాంత్, అప్పలకొండ యాదవ్, బుద్ధ లక్ష్మీనారాయణ, 48వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై కొవ్వొత్తుల ప్రదర్శన

మహారాణిపేట: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా బుధవారం ఆంధ్రా యూనివర్సిటీ విద్యా విభాగంలో ఆచార్య టి.షారోన్‌రాజు ఆధ్వర్యంలో ఆచార్యులు, విద్యార్థులు, పరిశోధకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా షారోన్‌రాజ్ మాట్లాడుతూ ఇటువంటి అతి హేయమైన, భయానకమైన ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ రాము, డాక్టర్ ప్రణీత్, డాక్టర్ సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాదారులపై చర్యలు


రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

మర్రిపాలెం : గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిర్మూలించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్టు కంచరపాలెం ఐదో పట్టణ సీఐ ఎస్.భాస్కర్‌రావు తెలిపారు. ఈ మేరకు కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధి జ్ఞానాపురం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం నంబర్ 8లో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఐదో పట్టణ పోలీసులు సంయుక్తంగా బుధవారం స్నిఫర్ డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నగరంలోని అన్ని వైపుల నుంచి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఉన్నతాధికారులు దృష్టి సారించారన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై ప్రజలు సమాచారం అందిస్తే త్వరితగతిన చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయితో రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం : అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 13.7 కేజీల సరకు స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గవర్నమెంట్ రైల్వే పోలీసులు (జీఆర్పీ), రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో సిబ్బంది బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ జూలి కర్మాకర్ తనిఖీల్లో కేరళకు చెందిన వివేక్ వద్ద గంజాయిని గుర్తించారు. అతను 13.7 కిలోల గంజాయిని విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా చెన్నైకు తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జీఆర్పీ ఎస్‌ఐ వి.రవివర్మకు అప్పగించారు. అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

35 వేల గణపతి మట్టి ప్రతిమలు సిద్ధం


గణపతి మట్టి ప్రతిమలతో రమేష్ రెడ్డి తదితరులు

సీతమ్మధార : నగరంలోని స్వాతి ప్రమోటర్స్ సంస్థ ఈ ఏడాది కూడా భక్తులకు వినాయక మట్టి ప్రతిమలు ఉచితంగా అందజేస్తుందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రమేష్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద గల సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన మట్టి ప్రతిమలు, వ్రతకల్పం పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నగరంలోని పలు ప్రాంతాలు, దేవాలయాలు, అపార్ట్‌మెంట్లు, ముఖ్యమైన జంక్షన్ల వద్ద 35 వేల మట్టి ప్రతిమలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సీతంపేట: బుల్లయ్య కళాశాలలో జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార వారోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్ జోలికి పోవద్దని సూచించారు. ఈ సందర్భంగా బీఎంఐ డైట్ ప్లాన్, కల్తీ ఫుడ్, నేచురల్ ప్రిజర్వేటివ్స్, ఈస్ట్ కిణ్వ ప్రక్రియ, మైక్రో గ్రీన్స్, ప్రో బయోటిక్స్, తదితర అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన డెమోలు, చార్టులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ పి.సురేఖ, కో ఆర్డినేటర్ డి.దీనబంధు, విభాగాధిపతులు ఎం.భారతి, ఎస్.శుభ, బి.శైలజ, కె.గీత పాల్గొన్నారు.